క్లుప్తంగా

సహస్రధార సమర్పణ

తిరువూరు: స్థానిక వేంకటాచల స్వామి ఆలయంలో ధనుర్మాస పూజాదికాల నిర్వహణకు అవసరమైన సహస్రధారను వైష్ణవ గోష్టి సభ్యులు కోలవెన్ను సుబ్బారావు, అపర్ణలు శుక్రవారం బహూకరించారు. ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామివారికి, ఆళ్వార్లకు, గోదాదేవికి నిర్వహించే నిత్య పూజల్లో సహస్రధారను వినియోగించనున్నట్లు అర్చకులు తెలిపారు.

ఇంధన పొదుపుపై అవగాహన సదస్సు

ఇబ్రహీంపట్నం: ఇంధనం పొదుపుగా వాడడం ద్వారా భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని ఎన్టీటీపీఎస్ ఎనర్జీ మేనేజర్ బి.హరి అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా జాకీర్ హుస్సేన్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సహకారంతో ఇంధన పొదుపుపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ బాగా పెరిగినందున సహజ వనరులు తరిగి పోతున్నాయన్నారు. ప్రజలు ఇంధన పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. 3 నుంచి 5 స్టార్లు కలిగిన ఎలక్ట్రానిక్స్ గృహోపకరణాలు వినియోగించాలని సూచించారు. కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు మెడల్స్ బహుకరించారు. ఎస్ఈ వెంకట్రావు, డెప్యూటీ కార్యదర్శి సుశీల, కళాశాల ప్రిన్సిపాల్స్ మస్తాన్‌వలి, జాఫర్ సాదిక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నాగుల్ మీరా పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు

- సిటీ స్కాన్ ఏర్పాటుకు కృషి
- మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: నూజివీడు ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులు ఇబ్బంది పడకుండా అత్యుత్తమ వైద్య సేవలందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ అత్యవసర చికిత్స కోసం ఏరియా ఆస్పత్రికి వచ్చిన రోగులను ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేయకుండా ఇక్కడే అత్యుత్తమ వైద్య చికిత్స అందించాలని చెప్పారు. ఆస్పత్రికి అవసరమైన సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో మాట్లాడి మంజూరయ్యేలా కృషి చేస్తానని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవలో ఆస్పత్రిలో రోగులకు అందించిన సేవలకు సంబంధించి రూ.2.30 కోట్ల ప్రోత్సాహకాలు అందాయన్నారు. నూజివీడు ఏరియా ఆస్పత్రిలో కొత్త భవనం నిర్మించి ఏడు నెలలు అయినప్పటికీ ఇంకా వినియోగంలోకి తీసుకురాకపోవడంపై అధికారులను మంత్రి ప్రశ్నించారు. జనవరి 7న వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా మంత్రి పార్థసారథి, సభ్యులుగా ముత్యాల కామేష్, గొల్లు దుర్గాదేవి, బొబ్బిలి ఝాన్సీరాణి, డాక్టర్ నాదెండ్ల శ్రీకాంత్, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఇళయరాజా, మెంబర్ కన్వీనర్‌గా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర సింగ్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సేవల సమన్వయాధికారి డాక్టర్ పాల్ సతీష్, మునిసిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

రెవెన్యూ సదస్సుల్లో సమస్యలపై అర్జీల సమర్పణ

మైలవరం: రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ జె. సుశీలాదేవి తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాలు కోసం ఐదు అర్జీలు, సర్వే కోసం ఆరు అర్జీలు అందాయన్నారు. సర్పంచ్ బొలగాని రాధమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్వో సురేష్‌కుమార్, సర్వేయర్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ డి. ప్రశాంతి అన్నారు. శుక్రవారం కోటపాడు, చీపురుగూడెంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సుల్లో ఆమె పాల్గొన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం తగిన ఆధారాలతో అర్జీలు అందజేయాలని చెప్పారు. రైతులు నుంచి మూడు అర్జీలు అందాయన్నారు. సర్వేయర్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కోటపాడులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

- **ముసునూరు:** రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై ఐదు అర్జీలు అందాయని తహసీల్దార్ పురుషోత్తమ శర్మ తెలిపారు. మండలంలోని సూరేపల్లిలో శుక్రవారం సర్పంచ్ ముల్లంగి సుధారాణి అధ్యక్షతన అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈఓపీఆర్డీ బీఏ సత్యనారాయణ, ఆర్ఐ దీపిక, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం రమణక్కపేటలో రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

సీపీఐ ఎంఎల్ నేత హరినాథ్ డిమాండ్

నూజివీడు: పార్లమెంటు సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తక్షణం రాజీనామా చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మతోన్మాద శక్తుల పాలనలో భారత రాజ్యాంగాన్ని మార్చాలని మనువాద సంస్కృతిని తీసుకురావాలని చేసిన కుట్రలను ప్రజలు తిరస్కరించినా వారికి బుద్ధి రాలేదన్నారు.

గోద్రా అల్లర్లలో ముస్లింలను ఊచకోత కోసిన కేసులో జైలు శిక్ష అనుభవించిన అమిత్ షా, అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని యావత్ జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సేవ్ ఇండియా, సేవ్ డెమోక్రసీ అని ప్రజలు దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నారని హరినాథ్ అన్నారు.

రైతులకు అండగా స్టేట్ బ్యాంక్



తిరువూరు: రైతులకు భారతీయ స్టేట్ బ్యాంక్ అన్ని వేళలా అండగా ఉంటుందని ఆ బ్యాంక్ తిరువూరు శాఖ చీఫ్ మేనేజర్ రవికుమార్ అన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం అన్నదాత మహోత్సవం కార్యక్రమాన్ని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులకు పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలను తమ బ్యాంక్ తక్కువ వడ్డీపై అందిస్తోందని, సబ్సిడీపై కూడా పలు రుణాలను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. వ్యవసాయాధికారి పద్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

భూముల ధరలు తగ్గించాలి

వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధుల వినతి

నూజివీడు: పట్టణంలోని మారుమూల ప్రాంతాల్లోని భూముల ధరలు మార్కెట్ రేటు కంటే ప్రభుత్వ ధర ఎక్కువగా ఉందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ధరను తగ్గించాలని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు సబ్ రిజిస్ట్రార్ వి. రాఘవరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ, ప్రస్తుత వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పేదలు, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో, బోర్వంచ రోడ్డులో గజం రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు మాత్రమే మార్కెట్ రేటు ఉండగా, ప్రభుత్వ ధర మాత్రం చాలా ఎక్కువగా రూ.19 వేలు ఉండటం దారుణమన్నారు. గతంలోనే మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి రిజిస్ట్రేషన్ శాఖ జిల్లా అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు తీర్మానం కాపీలను పంపించామన్నారు. దీనిపై ఇంతవరకు అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. అధిక ధరల కారణంగా ప్రజలపై పన్ను భారం ఎక్కువైందని, ఎవరైనా ఇళ్ల స్థలాలు కొనుక్కుంటే వారిపైన రిజిస్ట్రేషన్ ఫీజు భారం ఎక్కువవుతోందని చెప్పారు. భూముల ధరలను సవరించి ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొడవటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు మేకల అనిల్ కుమార్, రంగబాబు పాల్గొన్నారు.



నూజివీడు సబ్ రిజిస్ట్రార్ రాఘవరావుకు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

ఉద్యాన పంటలకు వందశాతం సబ్సిడీ

జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ ఉష

ఇబ్రహీంపట్నం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలకు వంద శాతం సబ్సిడీ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆ పథకం జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ ఉష తెలిపారు. మండలంలో పథకం ద్వారా సాగవుతున్న మామిడి, నిమ్మ, బొప్పాయి, మునగ తోటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సాగులో చేపట్టాల్సిన మెలకువలు రైతులకు తెలిపారు. కలుపు, పురుగు నివారణ, మొక్కల ఎదుగుదలకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. నూరుశాతం సబ్సిడీతో మామిడి, కొబ్బరి, జామ, సపోట, డ్రాగన్‌ఫ్రూట్ వంటి దీర్ఘకాలిక పంటలు రైతులు సాగు చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ దారావత్ ప్రసాద్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు అందజేత

మైలవరం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మోస్ట్ చారిటబుల్ సంస్థ చైర్మన్ చనమోలు వరప్రసాద్ అన్నారు. మైలవరం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్, మోస్ట్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కంప్యూటర్, టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు, ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం అందజేశారు. సంస్థ అధ్యక్షురాలు కోయ సుధ, పాలడుగు నాగేంద్రబాబు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటల పరిశీలన

మైలవరం: రెడ్డిగూడెం మండలంలో మామిడి తోటలను మండల ఉద్యాన అధికారి నరేంద్ర కుమార్ రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. అకాల వర్షాలకు పచ్చిపూత ఉన్న తోటల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తెల్లపూత ఉన్న రైతులు బ్లిటాక్స్ పిచికారీ చేయాలని చెప్పారు. మామిడి రైతులకు పలు సూచనలు చేశారు. డైరెక్టర్ కొండపల్లి పరమేశ్వరరావు, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రామారావు, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏడుగురు నిందితుల బైండోవర్

మైలవరం: పాత బెల్ట్ కేసుల్లో ఏడుగురు నిందితులను బైండోవర్ చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. షేక్ ఉద్దంషా, ఈతాకుల లక్ష్మణరావు, ముక్కమల వెంకటేశ్వరరావు, వల్లేటి వెంకయ్య, చింతపల్లి సాంబశివరావు, కోరుకొండ శ్రీనివాసరావు, పజ్జూరు వెంకటేశ్వరరావులను జి. కొండూరు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని చెప్పారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్

తిరువూరు: మహిళలు మోసగాళ్ల బారిన పడి మోసపోవద్దని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. ఎ. కొండూరు స్త్రీశక్తి భవనంలో శుక్రవారం జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవా విజ్ఞాన సంస్థల ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జడ్జి మాట్లాడుతూ మారుతున్న సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితుల కనుగుణంగా మహిళలు వ్యవహరించాలని, పలు రకాల పథకాల పేరుతో మోసగించే వ్యక్తులున్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల రక్షణకు అమలులో ఉన్న పలు చట్టాలను వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఏపీపీ బడేమియా, ఏజీపీ రాము, న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్ నాయక్

ఈ పంట నమోదును త్వరితగతిన పూర్తిచేయాలి

నూజివీడు: రబీ సీజన్‌లో ఈ పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా అన్నారు. నూజివీడు నియోజకవర్గంలోని వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో శుక్రవారం నూజివీడులో సమీక్ష సమావేశం నిర్వహించారు. హబీబ్ బాషా మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకానికి సంబంధించి రైతులందరూ సమీపంలోని సీఎస్‌సీ, రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వరి, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు ఈ నెలాఖరు వరకు బీమా ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉందని చెప్పారు. సమావేశంలో ఏడీఏ జి. విద్యాసాగర్, నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి ఏఓ చాముండేశ్వరి, ఎస్. మధుమోహన్, శివశంకర్, చెన్నారావు, సీహెచ్ సూరిబాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా

108 దివ్య క్షేత్రాల పూజ



తిరువూరు: స్థానిక రాజ్యలక్ష్మి సమేత రంగనాయక స్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం 108 దివ్య క్షేత్రాల పూజ నిర్వహించారు. పలు పుణ్యక్షేత్రాల నుంచి తెచ్చిన కలశాలకు పూజలు, కుంకుమ పూజ చేశారు. ఆయా క్షేత్రాల విశిష్టతను అర్చకులు వివరించారు. ఆలయ ధర్మకర్త రంగారావు పర్యవేక్షించారు.

వేతనాలు చెల్లించాలని వినతి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు ఎం.మహేష్, ఎం. సోమేశ్వరరావు కోరారు. ఈ మేరకు విద్యాశాఖ జిల్లా అధికారి ఎం.సుబ్బారావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతి 100 మంది విద్యార్థులకు ఒక ఆయాను ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ పరికరాలు, ప్రమాద బీమా, యూనిఫాం సదుపాయం కల్పించాలని కోరారు.

శునకాల స్వైర విహారం

చాట్రాయి: వీధుల్లో శునకాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామాల్లో ఏ వీధిలో చూసినా 20 నుంచి 30 శునకాలు గుంపులుగా చేరి పాదచారులు, వాహనచోదకులను వెంబడిస్తూ దాడికి దిగుతున్నాయి. ఇటీవల చనుబండ గ్రామంలో 20 మేక పిల్లలపై శునకాలు దాడి చేసి చంపేశాయి. రాత్రి సమయాల్లో పాదచారులపై దాడులు చేస్తున్నాయి. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలో శునకాల గుంపు హడావుడి చూసి హడలిపోతున్నారు. ఒక్కొక్క గ్రామంలో 150 నుంచి 200 వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. ఇప్పకైనా అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చనుబండలో సంచరిస్తున్న వీధి కుక్కలు

పరీక్షా పత్రాలను పాఠశాలలకే అందించండి

ముసునూరు: పరీక్షా పత్రాలను పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా సమయానికి ఒక గంట ముందు ఉపాధ్యాయులు పాఠశాలకు తీసుకెళ్లాలనే ఉన్నతాధికారుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మకిశోర్, జి.రాంబాబు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలో పరీక్షా పత్రాలను సకాలంలో తీసుకెళ్లాలనే ఆందోళనలో రహదారి ప్రమాదానికి గురై ఉపాధ్యాయుడు సిద్ధయ్యశెట్టి మృతి చెందాడని చెప్పారు. శుక్రవారం ఎంఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఉపాధ్యాయుడి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల రక్షణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేస్తూ ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు, యూటీఎఫ్ నేతలు నారాయణ, ఫ్రాన్సిస్, మాణిక్యాలరావు, వెంకటరమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్

చంద్రాల(మైలవరం): చంద్రాల పీహెచ్‌సీలో సెమీ క్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి సునీల్ మాట్లాడుతూ సిబ్బంది ఎప్పుడూ పని ఒత్తిడిలో ఉంటూ ఆనందానికి దూరం అవుతుంటారని, ఈ రకంగా సెమీ క్రిస్మస్ వేడుకను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాస్టర్ తిమోతి తమ్మిన మాట్లాడుతూ క్రీస్తు మార్గంలో నడవాలని చెప్పారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ సునీల్, అరుణ, యోచన, సిబ్బంది పాల్గొన్నారు.

భావ వ్యక్తీకరణకు భాషే ప్రధానం



విజయవాడ కల్చరల్: భావ వ్యక్తీకరణకు భాషే ప్రధానమని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం వైస్‌చాన్సలర్ ఆచార్య వెలిదండ్ల నిత్యానందరావు అన్నారు. చిన్నయ సూరిల సాహితీపీఠం ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో శనివారం చిన్నయసూరి 218 జయంతి సభ, గుమ్మా సాంబశివరావు, వెలమల సిమ్మన్న రచించిన శబ్దబ్రహ్మ పరవస్తు చిన్నయ సూరి గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన నిత్యానందరావు మాట్లాడుతూ తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషి వెలకట్టలేదన్నారు. అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ బాల బాలికలకు భాష పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. చిన్నయ సూరి కళాపీఠం చేస్తున్న కృషిని అభినందించారు. సభకు కళాపీఠం అధ్యక్షుడు శోభనాద్రి సంస్థ లక్ష్యాలను వివరించారు. కార్యక్రమంలో గుమ్మా సాంబశివరావు, వెలమల సిమన్న, కేశవమతం అనిల్‌కుమార్ సూరి, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచందు చిన్నయ సూరి సేవలను వివరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయకవితా గానం చేశారు. నిర్వాహకులు అతిథులను, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను సత్కరించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్పీ శేషగిరి రావు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి సాహితీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వత్సవాయి: మండల కేంద్రం వత్సవాయి సమీపంలోని రాష్ట్ర సరిహద్దు వద్ద ఎస్‌ఐ పి.ఉమామహేశ్వర రావు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. గతంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులక విధించిన చలానాల చెల్లింపులను పరిశీలించారు. వాహనదారులంతా హెల్మెట్ ధరించాలని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

పెరిగిన పెట్టుబడులు.. తగ్గిన దిగుబడులు

- ఈ ఏడాది రెండు సార్లు విత్తిన రైతులు
- వరదలకు దెబ్బతిన్న పంటలు
- సకాలంలో అందని నీటి తడులు
- నష్టాల బాటలో మినుము రైతులు



కిలేశపురంలో నీటి ఎద్దడితో ఇంకా పూత, పిందె దశకు చేరని మినుము పైరు

ఇబ్రహీంపట్నం: మినుము రైతులను ఈ ఏడాది కష్టాలు వెంటాడుతున్నాయి. ఆగస్టు నెలలో అపరాలు సాగు చేసిన రైతులకు సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన అధిక వర్షాలు, వరదలతో మైలవరం నియోజకవర్గంలో దాదాపు 600 ఎకరాల్లో మినుము పంట తుడిచిపెట్టుకు పోయింది. ఇబ్రహీంపట్నం మండలంలో రెండోసారి అక్టోబర్‌లో మరలా సుమారు 500 ఎకరాల్లో మినుము ఎద పెట్టారు. నీటి తడులు అందక ఎకరాకు సుమారు 3 నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. దళారుల మాయాజాలంతో రైతుకు ఆశించిన ధర లభించిక నష్టాలు తప్పడం లేదు. కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

విత్తు నుంచి ఇబ్బందులు

మైలవరం నియోజకవర్గంలో సుమారు 1,550 ఎకరాల్లో రైతులు మినుము సాగు చేశారు. ఈ ఏడాది అధిక వర్షాలు, కృష్ణానది వరదల కారణంగా ఇబ్రహీంపట్నం మండలంలోని అనేక గ్రామాల్లో విద్యుత్ పోల్స్ విరిగి ట్రాన్స్‌ఫార్మర్లు నేల వాలాయి. నూతన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు తిరిగి ఏర్పాటు చేసేందుకు సుమారు రెండు నెలలు పట్టింది. డిసెంబర్‌లో రెండో పంటగా మొక్కజొన్న సాగు సమయం దాటి పోతుందని హడావుడిగా అక్టోబర్‌లో దుక్కులు సిద్ధం చేసుకుని మినుము విత్తారు. పూత, పిందె దశలో కరెంటు అందుబాటులో లేకపోవడంతో సకాలంలో పంటకు నీటి తడులు ఇవ్వలేక పోయారు. పురుగు, కలుపు మందులు పిచికారీ చేసేందుకు కూడా నీటి సదుపాయం లేకుండా పోయింది. ట్రాక్టర్లపై వాటర్ ట్యాంకులతో మందులు పిచికారీ చేశారు. నీటి ఎద్దడి ప్రభావం పంట దిగుబడిపై పడింది. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చిందని రైతులు చెబుతున్నారు.

దళారుల మాయాజాలం

మూడు నెలల సమయం పట్టే మినుము పంటకు విత్తనం విత్తే సమయంలో వరదల కారణంతో కొందరు రెండుసార్లు విత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ విధంగా ఈ ఏడాది ఖర్చులు అదనమయ్యాయి. వరద ప్రభావంతో పంట దిగుబడులు తగ్గాయి. గింజల నాణ్యత కూడా తక్కువగా ఉంది. గింజ నాణ్యతను అలుసుగా తీసుకుని దళారులు ఇష్టారాజ్యంగా ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. పంట విత్తే సమయంలో క్వింటా రూ.10 వేలు నుంచి రూ.11 వేలు ధర పలికింది. పంట చేతికొచ్చే సమయానికి క్వింటా రూ.7 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. బాగా లావుగా ఉన్న వాటికి రూ.8 వేలు ఇస్తున్నారు. ఈ లెక్కన యావరేజ్‌గా 4 బస్తాలకు రూ.28 వేలు ధర పలుకుతుంది. ఖర్చులు రూ.30 వేల వరకు అయ్యాయి. పెట్టుబడి కూడా రాకపోవడంతో పాటు మూడు నెలలపాటు పడిన కష్టం కూడా రైతుకు దక్కలేదు. కౌలు రైతులు చేతి డబ్బులు వేసుకునే పరిస్థితి వచ్చింది. మినుము కొనుగోలు చేయాల్సిన నాఫెడ్ సంస్థ రైతుల వైపు తిరిగి చూడక పోవడంతో దళారులదే పైచేయిగా ఉంది. రైతులు పంటను అమ్మాలా, వద్దా అనే సంశయంలో పడ్డారు. కొంతమంది రైతులు పంటను ఇళ్ల వద్దే ఉంచుకుంటున్నారు. క్వింటా ధర కనీసం రూ.10 వేలు ఉంటే బాగుండేదని రైతులు అంటున్నారు.

పెట్టుబడి కూడా రాలేదు



వరదలకు ముందు ఐదెకరాల్లో మినుము సాగు చేశా. వరదకు మొత్తం తుడిచిపెట్టుకు పోయింది. మరలా సాగు చేపట్టా. ఎకరాకు సుమారు రూ.30 వేలకు పైగా ఖర్చు అయింది. సకాలంలో కరెంటు లేకపోవడంతో నీటి తడులు అందించలేక బెట్టకొట్టి పంట దిగుబడి తగ్గింది. క్వింటా రూ.7 వేలు ధర అంటున్నారు. పెట్టుబడి ఖర్చు కూడా వచ్చేలా లేదు. క్వింటా ధర రూ.10 వేలు వరకు ఉంటే బాగుండేది.

– రెంటపల్లి నాగరాజు, రైతు, కొటికలపూడి

పెరిగిన పెట్టుబడులు

మినుము పంటకు ఈ ఏడాది పెట్టుబడి అధికమైంది. వరద ప్రభావంతో జూపూడి, కొటికలపూడి, చినలంక, పెదలంక, మూలపాడు గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు వేశాయి. ఇసుక మేటలు డోజర్‌తో తొలగించేందు ఎకరాకు రూ.3 వేల వరకు ఖర్చు చేశారు. అనంతరం దుక్కులకు రూ.4 వేలు, విత్తనాలకు రూ.2 వేలు, ఎద పెట్టినందుకు రూ.2 వేలు, పురుగులు, కలుపు మందులు రూ.12 వేలు, కోత కూలీల ఖర్చు రూ.3,000, మిషన్‌లో ఆడినందుకు రూ. 1,750, మిషన్‌లో వేసేందుకు కూలీలకు రూ.1,750 ఖర్చు చేశారు. చివరలో నీటి తడుపుల ఖర్చు రూ.1,000 ఈ లెక్కన ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. ఆశించిన దిగుబడి, లాభాలు రాక పోయినా కనీసం ఖర్చులు వస్తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

స్కేటర్ జెస్సీరాజ్‌కు కేంద్ర పురస్కారం

26న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రదానం



మాత్రపు జెస్సీరాజ్

విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయ స్కేటింగ్ వేదికపై అద్భుత ప్రదర్శన ఇచ్చి ప్రపంచ క్రీడా ప్రముఖుల మన్ననలు పొందిన ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్‌ను ప్రతిష్టాత్మక ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్–2025 వరించింది. ఏటా దేశంలోని 25 మంది ప్రతిభావంతులైన చిన్నారులకు కేంద్రం ఈ పురస్కారం అందజేస్తోంది. ఈ ఏడాది క్రీడా విభాగంలో జెస్సీరాజ్‌ను ఎంపిక చేస్తూ కేంద్ర ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ నెల 17న విడుదల చేసిన జాబితాలో పేర్కొంది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారం ప్రదానం చేస్తారు. విజయవాడ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్‌లో జెస్సీ తొమ్మిదో తరగతి చదువుతోంది. స్కేటింగ్‌పై ఆమె చూపుతున్న ఇష్టాన్ని తల్లిదండ్రులు మాత్రపు రాధ, సురేష్ గమనించి కోచ్ సింహాద్రి వద్ద శిక్షణ ఇప్పించారు. తొమ్మిదేళ్ల వయసు నుంచే శిక్షణ తీసుకుంటూ ఇప్పటి వరకు 50 రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పతకాలను సొంతం చేసుకుంది.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

నందిగామటౌన్: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ప్రభుత్వ విప్, నందిగామఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ వేడుకలను శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు.

వాతావరణంలో మార్పులతో రైతుల బేజారు

- తేమ శాతం పేరుతో కొనుగోలుకు నిరాకరణ
- మైలవరం వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు
- చినుకులు పడుతుండటంతో తీవ్ర ఆందోళన



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు



రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం

మైలవరం: అల్పపీడనంతో ఏర్పడిన వాతావరణంలో మార్పులతో రైతులు బేజారవుతున్నారు. వరి పంటలు కోసి నూర్చిన ధాన్యాన్ని ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాలకు తరలించారు. ధాన్యంలో తేమ శాతం ఎక్కువగా ఉందని ఆర్ఎస్‌కే అధికారులు ధాన్యం తీసుకోవడానికి తిరస్కరించారు. దీనితో రైతులు ధాన్యాన్ని మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి గత నాలుగు రోజులుగా ఆరబెట్టుకుంటున్నారు. చినుకులు పడుతుండటంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. మైలవరం మండలానికి చెందిన 500 మంది రైతులు తమ ధాన్యాన్ని ఏఎంసీకి తీసుకువచ్చి ఆరబెట్టుకుంటున్నారు. మధ్యమధ్యలో చినుకులు పడుతుండటంతో పట్టాలు కప్పుకుని వర్షం నుంచి ధాన్యం కాపాడుకుంటున్నారు. తేమ శాతంలోనైనా ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించాలని రైతులు కోరుకుంటున్నారు.

తేమశాతం 17 ఉంటేనే తీసుకుంటున్నారు



రైతు సేవ కేంద్రాల్లో ధాన్యంలో తేమ శాతం 17 ఉంటేనే తీసుకుంటామంటున్నారు. దీనితో ధాన్యం తీసుకువచ్చి మైలవరం మార్కెట్ యార్డులో ఆరబెట్టుకుంటున్నాము. తేమ శాతం 17లోపు ఉంటే ధర పలుకుతుంది. తేమ శాతం 17 కన్నా ఎక్కువగా ఉంటే రేటు మారిపోతుంది. క్వింటాకు రూ.1700 ఇస్తున్నారు. 250 టిక్కీలు తీసుకువచ్చి ఆరబెట్టుకుంటున్నాను. ఇది ఎప్పటికి ఆరుతుందో తెలియడంలేదు. ఏఎంసీ వారు పట్టాలు ఇచ్చారు కనుక కొంత వెసులుబాటుగా ఉంది. లేకుంటే అదనపు ఖర్చులు భరించాల్సి వచ్చేది.

– మట్లా సాంబయ్య, వెల్వడం

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కులపై అవగాహణ పెంపొందించుకోవాలని ఏలూరు లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ పి. సుధాకర్ సూచించారు. వినియోగదారుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్ధేశించి మాట్లాడారు. వినియోగదారులు ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇక్కడ తెలుసుకున్న విషయాలను తోటివారికి తెలియజేసి వినియోగదారులు మోసపోకుండా విద్యార్థులు వారి వంతు పాత్రను సమర్ధవంతంగా పోషించాలని కోరారు. లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ ఎ. కృష్ణ చైతన్య వివిధ రకాల కొలతలు, తూనికల గురించి అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు వినియోగారుల వారోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కన్స్యూమర్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. నవీన, కళాశాల కామర్స్ విభాగం ఇంచార్జ్ సి.హెచ్. కొండలరావు, రోజలిండ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ సుధాకర్

మద్యం సీసాలు స్వాధీనం

కంచికచర్ల: వీరులపాడు మండలం దాచవరంలో ఓవ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈసందర్భంగా ఎక్సైజ్‌శాఖ సీఐ షేక్ అఫ్రపున్నీసాబేగం మాట్లాడుతూ అక్రమంగా మద్యం అమ్మినా లేదా తరలించినా కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎస్ఐ గాలీబ్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.





అర్జున్ వీధులో విద్యుద్దీపాలంకరణ

భవానీమాతాకీ.. జై..

దీక్షలను విరమించేందుకు భవానీలు పెద్ద సంఖ్యలో ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. శుక్రవారం నుంచి దీక్ష విరమణ మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అమ్మవారు కొలువై ఉండే ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ చేసి ఆ తల్లిని దర్శించుకుని ఇరుముడి సమర్పించడంతో దీక్ష పూర్తి చేస్తారు. రైళ్లు, బస్సుల్లో భవానీలు నగరానికి చేరుకుని అక్కడి నుంచి ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





అమ్మవారి దర్శనానికి వస్తున్న భవానీలు



విద్యుత్ వెలుగుల్లో మహారాజగోపురం



అర్జున్‌వీధిలో ప్రసాదాల కౌంటర్ వద్ద..





అమ్మవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లు



కృష్ణవేణి ఘాట్ సమీపంలో కేశ ఖండనశాల

గుణదల రైల్వే స్టేషన్‌కు మహర్దశ

- అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రయాణికులకు సౌకర్యాలు
- అమృత్ స్టేషన్ పథకంలో శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి
- రూ. 35 కోట్లతో చురుగ్గా మొదటి దశ పనులు
- వచ్చే ఏడాది జూన్ నాటికి పనులు పూర్తి



గుణదల రైల్వేస్టేషన్ నమూనా చిత్రం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఎయిర్‌పోర్టు తరహాలో రైలు ప్రయాణికులకు అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సదుపాయాలు అందించే దిశగా గుణదల రైల్వే స్టేషన్ సరికొత్త హంగును సంతరించుకోనుంది. ఒకప్పుడు ఆపరేషన్ స్టేషన్‌గా మాత్రమే ఉన్న గుణదల రైల్వే స్టేషన్‌లో ఒకటి, రెండు ప్యాసింజర్ రైళ్లు మాత్రమే నిలిచేవి. అమృత్ భారత్ స్టేషన్ స్కీం (ఏబీఎస్ఎస్) పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 1300 రైల్వే స్టేషన్‌లు అంతర్జాతీయస్థాయిలో స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు, విశాలమైన పార్కింగ్, షాపింగ్ మాల్స్, ప్రయాణికుల సౌకర్యాలు, ప్రధాన రహదారులను కలుపుతూ అంతర్గత రహదారులతో స్టేషన్‌ల పునరాభివృద్ధి పనులకు రైల్వేశాఖ పచ్చజెండా ఊపింది. ఈ పథకంలో దక్షిణ మధ్య రైల్వేలో 72 స్టేషన్‌లు ఎంపిక కాగా, విజయవాడ డివిజన్‌లో 22 స్టేషన్‌లు ఉండగా వాటిలో గుణదల రైల్వే స్టేషన్ ఒకటి.

శాటిలైట్ స్టేషన్‌గా గుణదల....

ఏబీఎస్ఎస్ పథకంలో భాగంగా విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌కు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు గుణదల రైల్వే స్టేషన్‌ను శాటిలైట్ స్టేషన్‌గా అభివృద్ధి పర్చేందుకు రైల్వేశాఖ రూ. 35.5 కొట్లతో మొదటి దశ పనులు చేపట్టింది. ఈ పనులు పూర్తయితే నిత్యం 250 రైళ్లు, 1.40 లక్షల ప్రయాణికులతో రద్దీగా ఉండే విజయవాడ స్టేషన్‌పై చాలా వరకు ఒత్తిడి తగ్గే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా విశాఖ, భువనేశ్వర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లు విజయవాడకు బదులుగా గుణదల స్టేషన్‌లో ఆగుతాయి. దీంతో విజయవాడ స్టేషన్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది.

అంతర్జాతీయస్థాయిలో సదుపాయాలు...

శాటిలైట్ స్టేషన్‌గా రూపాంతరం చెందనున్న గుణదల రైల్వే స్టేషన్ విజయవాడ జంక్షన్‌కు ప్రత్యామ్నాయంగా మారనుంది. దాదాపుగా విశాఖ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే అన్ని ప్రధాన రైళ్లు ఇక్కడే ఆగనున్నాయి. దీంతో ప్రయాణికుల సంఖ్య కూడా భారీగా పెరగనుండటంతో ఏబీఎస్ఎస్ పథకంలో రూ. 35 కోట్లతో గుణదల స్టేషన్ పునరాభివృద్ధి పనులను గతిశక్తి ప్రాజెక్టుకు అప్పగించింది. ఈ మేరకు గత ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేశారు. దీనిలో ఆధునిక బహుళ అంతస్తుల స్టేషన్ భవన నిర్మాణాలు, పరిసర ప్రాంతాల్లో గ్రీనరి, ఏసీ, నాన్ ఏసీ వెయిటింగ్ హాల్స్, ప్లాట్ ఫాంల పొడిగింపు, ఎస్కెలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు, ఫుట్ బ్రిడ్జి నిర్మాణాలు, రిజర్వేషన్ కౌంటర్‌లు, ముఖ్యంగా దివ్యాంగ ప్రయాణికుల కోసం ప్రత్యేక ర్యాంపు మార్గాలు, మాడ్యులర్ టాయిలెట్‌ల నిర్మాణాల పనులు జరుగుతున్నాయి.

ఆదాయ వనరుగానూ గుణదల స్టేషన్...

స్టేషన్‌లో వినియోగించే విద్యుత్ అవసరాల కోసం సోలార్ ప్లాంట్ ఏర్పాట్లకు అధికారులు చర్యలు చేపట్టారు. స్టేషన్‌లో ఏర్పాటు చేయబోయే మూడు ప్లాట్‌ఫాం పైకప్పులపై సోలార్ ప్యానెల్స్‌ను వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేయనున్నారు. వీటితో పాటు ఆదాయం సమకూర్చుకునేందుకు స్టేషన్‌లో స్థానిక ఉత్పత్తులతో ప్రత్యేక స్టాల్స్, ఫుడ్ కోర్టు, పిల్లల కోసం ప్లే స్టేషన్‌లు తదిర ఏర్పాట్లు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వచ్చే జూన్ నాటికి పనులు పూర్తి..



పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఎయిర్‌పోర్టు తరహాలో రైలు ప్రయాణికులకు కొత్త అనుభూతి కలిగేలా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఈ స్టేషన్ అందుబాటులోకి వస్తే విజయవాడ ప్రధాన రైల్వే స్టేషన్‌లో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుంది. నగరంతో అన్ని ప్రాంతాల నుంచి అనుసంధానంగా ఉన్న గుణదలలోనే ప్రయాణికులు రైలు ఎక్కి, దిగేందుకు ఎంతో సులువు ఉంటుంది. ఇప్పటికే 25 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే జూన్ నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాము.

–పి.ఈ ఎడ్విన్, (ఏడీఆర్ఎం, విజయవాడ డివిజన్)



తుది దశలో గుణదల స్టేషన్ భవన నిర్మాణ పనులు

26న ద్విచక్ర వాహనాలకు వేలం

జి.కొండూరు: జి.కొండూరు పోలీసులకు పట్టుబడిన పది (అన్ క్లైమ్డ్ స్క్రాఫ్) ద్విచక్ర వాహనాలకు ఈ నెల 26న వేలంపాట నిర్వహిస్తామని ఎస్ఐ సతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తహసీల్దార్ ఆధ్వర్యంలో వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 26న ఉదయం 9 గంటలకు జి.కొండూరు పోలీసు స్టేషన్‌కు రావాలని కోరారు.



రోగులకు సత్వర సేవలందించాలి

కలెక్టర్ లక్ష్మీశ

తిరువూరు: ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు సత్వరమైన, నాణ్యమైన వైద్య సేవలందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వైద్యులకు సూచించారు. తిరువూరు ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం సందర్శించిన ఆయన ప్రసూతి వార్డు, అత్యవసర వార్డు, ఆరోగ్యశ్రీ విభాగాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వైద్యసేవల నిమిత్తం ఖర్చు చేస్తోందని, ఆస్పత్రిలో సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.
తిరువూరు ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డెప్యూటీ సివిల్ సర్జన్, గైనకాలజిస్ట్ తదితర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరువూరు ప్రభుత్వాస్పత్రికి తెలంగాణ రాష్ట్రం నుంచి సైతం రోగులు వచ్చి వైద్యసేవలు పొందడం హర్షణీయమని, మారుమూల ఉన్నప్పటికీ ఇక్కడి ప్రజలకు 24 గంటలు సేవలందించేందుకు వైద్యులు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. డయాలసిస్ యూనిట్‌లో రోగులను కలెక్టర్ పరామర్శించారు. అనంతరం నగర పంచాయతీ నిర్వహించే డంపింగ్ యార్డు, రీ సైక్లింగ్ యూనిట్‌లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి నాయక్, తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి మాధురి, తహసీల్దార్ లక్ష్మి, నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి గార్గేయ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

తిరువూరు నగర పంచాయతీలో పలు సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఛైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, కౌన్సిలర్లు కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు. వేసవి కంటే ముందే పట్టణంలో మంచినీటి ఎద్దడి నెలకొందని, కృష్ణా నదీ జలాలను తాగునీటి అవసరాలకు సరఫరా చేసే పైలట్ ప్రాజెక్టు పనులు చేపట్టాలని, డ్రెయినేజీ, రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. వైస్ ఛైర్‌పర్సన్స్ విజయలక్ష్మి, వెంకటేశ్వరి, కౌన్సిలర్ పరసా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రారంభం



తిరువూరు: తిరువూరు పట్టణంలో కేటగిరీ–2 విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు 300 కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లను బిగించినట్లు అర్బన్ విద్యుత్ ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు. కమర్షియల్ కాంప్లెక్సులు, దుకాణాల్లో 2,700 స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

కట్నం వేధింపుల కేసులో జైలు

తిరువూరు: కట్నం వేధింపులకు గురిచేసిన వ్యక్తికి తిరువూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రూ.వెయ్యి జరిమానా, 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పింది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి మండలం వేగివాడకు చెందిన శెట్టిపల్లి శివనాగ మహేశ్వరరావుకు తిరువూరు రాజుపేట వాసి మాధవితో 2015లో వివాహమైంది. తనను భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని మాధవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేశ్వరరావుపై పోలీసులు కేసు నమోదు చేసి తిరువూరు కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం శివనాగ మహేశ్వరరావుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.





















